తెలంగాణను దొంగల చేతిలో పెట్టొద్దు

- కాంగ్రెస్‌కు అధికారమిస్తే దోపిడే
- మరోసారి ఆశీర్వదించి.. అభివృద్ధికి ఓటేయండి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్


మంత్రి గంగుల కమలాకర్‌ను గజమాలతో సన్మానిస్తున్న కార్పొరేటర్ కుర్ర తిరుపతి

కరీంనగర్/కరీంనగర్‌రూరల్/కొత్తపల్లి: కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతిలో పెట్టొద్దని, అభివృద్ధి కావాలంటే బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని కరీంనగర్ అసెంబ్లీ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా 24, 25, 3వ డివిజన్ అంబేడ్కర్‌నగర్, శివాజీనగర్, కిసాన్‌నగర్‌లలో ప్రచారం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలని, 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో జరగని అభివృద్ధి సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లలో చేసి చూపించారని అన్నారు. కాంగ్రెస్‌కు అధికారమిస్తే ఉన్న పథకాలకు మంగళం పాడి రాష్ట్రాన్ని దోపిడీ చేస్తారని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో దేశంలోనే నంబర్‌వన్‌స్థానంలో నిలిచిందని అన్నారు. తెలంగాణ ఏర్పడ్డాక కరీంనగర్ నియోజకవర్గాన్ని ఊహించని అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దామని తెలిపారు. నగరాన్ని ఈ పదేళ్లలో రాష్ట్రం నుంచి రూ.వేల కోట్ల నిధులు తీసుకువచ్చి ఎంతో అభివృద్ధి చేశానని అన్నారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మరోసారి కారు గుర్తుపై ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు కుర్ర తిరుపతి, ఎడ్ల సరిత అశోక్, కంసాల శ్రీనివాస్, నయీమ్, నారాయణ, పసుల చరణ్, బెజగం మధు, తీట్ల ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఆశీర్వదించండి

ప్రజలందరూ ఆశీర్వదించి ఎమ్మెల్యేగా నాల్గోసారి గెలిపిస్తే కరీంనగర్ నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి, కరీంనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ అన్నారు. శనివారం కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్, తాహెర్‌కొండాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డప్పుచప్పుళ్లతో ఇంటింటా తిరుగుతూ తాను చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ సమైక్య పాలనలో కరెంట్ కోతలతో రైతులు ఎన్నో ఇబ్బందులను పడినట్లు తెలిపారు. తెలంగాణలో రైతుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. పచ్చని తెలంగాణపై విషం చిమ్ముతున్న సమైక్యవాదులు కాంగ్రెస్, బీజేపీ ముసుగులో మళ్లీ వస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య, వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, కరీంనగర్‌సింగిల్ విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి, సర్పంచులు రమణారెడ్డి, మమత, నర్సయ్య, భూమయ్య, ఎంపీటీసీ తిరుపతిగౌడ్, ఉప సర్పంచులు శంకరయ్య, సంపత్‌రావు, శంకర్‌గౌడ్, నాయకులు శ్యాంసుందర్‌రెడ్డి, తిరుపతియాదవ్, లక్ష్మణ్, సుధాకర్, రాజమల్లు, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కొత్తపల్లి మండలం బద్దిపల్లికి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీ యువకులు శనివారం మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్ నాయకుడు పిల్లి మహేశ్ ఆధ్వర్యంలో చేరిన వీరికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జీకే యాత్ అధ్యక్షుడు పొల్లాల నాగరాజుగౌడ్, ఉపాధ్యక్షుడు సోమన్, కోశాధికారి నవీన్, పోలుదాసరి శరత్, వినయ్‌గౌడ్, సందీప్‌గౌడ్, మురళీగౌడ్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన డివిజన్ ప్రజలు

ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

కరీంనగర్: 11వ డివిజన్ కట్టరాంపూర్‌లోని అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. అనంతరం బీజేపీకి చెందిన మహిళలు డివిజన్ కార్పొరేటర్ ఆకుల నర్మదనర్సన్న ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి గంగుల కమలాకర్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కొత్తపల్లిలో ఇంటింటా ప్రచారం

బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్‌ను గెలిపించాలని కోరుతూ శనివారం కొత్తపల్లిలో మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. 45, 46, 49, 50 బూత్‌ల పరిధిలో ఇంటింటా తిరుగుతూ గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు బండ గోపాల్‌రెడ్డి, గున్నాల రమేశ్, జేరిపోతుల శివ, ఎస్.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు భూకబ్జాదారులే

- మచ్చలేని జీవితం నాది.. పేదల కోసం యుద్ధం చేస్తున్న
- న్యాయ నిర్ణేతలు మీరే.. ఆలోచించి ఓటేయండి
- కరీంనగర్ ప్రజలకు బండి సంజయ్‌కుమార్ వినతి


బీజేపీలో చేరిన యువకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లో పోటీ చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులిద్దరూ భూకబ్జాదారులేనని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్నారు. పేదల భూములను సైతం వదల్లేదని, నిరంతరం వీరి భూబాగోతాలపై ఎంతో మంది బాధితులు మీడియా సాక్షిగా గోడు వెళ్లబోసుకున్నారని తెలిపారు. అవినీతిలో నువ్వా నేనా? అన్నట్లు పోటీ పడుతున్నారని ఎద్దేవా చేశారు. మచ్చలేని రాజకీయ జీవితం తనదని, ధర్మ రక్షణ కోసం, పేదల పక్షాన అలుపెరగని యుద్ధం చేస్తున్న చరిత్ర తనదని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలని, ఆలోచించి ఓటేయాలని కోరారు. శనివారం కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో భారీ ఎత్తున యువకులు, వివిధ పార్టీల నాయకులు బీజేపీలో చేరారు. వీరందరికీ బండి సంజయ్ కాషాయ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కరీంనగర్‌రూరల్ మండలంలోని మందులపల్లి గ్రామంలో మందుల సామాజిక వర్గానికి చెందిన పరుశురాం సహా 15 మంది బీజేపీలో చేరారు. కరీంనగర్‌లోని 15వ డివిజన్ రాంనగర్‌కు చెందిన ప్రవీణ్ ఆధ్వర్యంలో దాదాపు 100 మంది యువకులు పార్టీలో చేరారు. శివప్రసాద్, సాగర్ గౌడ్, చరణ్, అనిల్‌కుమార్, రాజకుమార్ నాయక్, శివకుమార్‌గౌడ్, సాయిచరణ్, సాయి నవీన్, సంజీవ్, నరేశ్, విష్ణు, మణికుమార్ తదితరులున్నారు. అలాగే 11వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు ఓదెల యాదవ్, వినయ్ యాదవ్, కనకరాజు, కోల నర్సయ్య, శశికుమార్, మహదేవుని రాజ్‌కుమార్, రాకం విజయ్ కుమార్, సాయికుమార్, చరణ్, రాకేశ్, రాహుల్, జైరాం సహా 30 మంది నాయకులు బండి సంజయ్ సమక్షంలో కాషాయ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడారు. బండి సంజయ్‌ను ఎంపీగా గెలిపిస్తే కరీంనగర్‌కు చేసిందేమీ లేదంటూ బీఆర్ఎస్ నాయకులు నాపై దుష్ప్రచారం చేస్తున్నారని వారికి నేను చెప్పేదొక్కటే. కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నీ కేంద్రానివే. స్మార్ట్‌సిటీ నిధులు తెచ్చిన. ఆర్వోబీ నిధులు తెచ్చిన. రోడ్లకు నిధులు తెచ్చిన. డ్రైనేజీ, టాయిలెట్లు సహా కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులన్నింటికీ కేంద్రమే నిధులిస్తోంది. ఎంపీగా నన్ను గెలిపిస్తే తెలంగాణ ప్రజల కోసం యుద్ధం చేసిన. కేసీఆర్ నన్ను అణిచివేసేందుకు ఏకంగా నాపై 74 కేసులు పెట్టారు. నా ఆస్తి కోసమో, కుటుంబం కోసమే కొట్లాడలే. పేదల కోసం కొట్లాడిన. నిరుద్యోగ యువత కోసం, రైతుల పక్షాన, ఉద్యోగులు, మహిళల పక్షాన కొట్లాడిన. ప్రజాస్వామ్యంలో ప్రజలే న్యాయ నిర్ణేతలు. ఆలోచించి ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హౌసింగ్‌బోర్డులో బండి కుటుంబసభ్యుల ఇంటింటా ప్రచారం

నగరంలోని 7వ డివిజన్ హౌసింగ్‌బోర్డు కాలనీలో శనివారం బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ అన్న శ్రావణ్‌కుమార్ దంపతులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీజేపీ నాయకులు తోట సాగర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎల్లారెడ్డి, నర్సింహారెడ్డి,, భాస్కర్, కోటి, తోట సతీశ్, రవికిరణ్, రంగనాయకుల శ్రీనివాస్, గదార్ల మల్లేశం, సతీశ్, చింటూ, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రేకుర్తి 18వ డివిజన్‌లో బీజేపీ ప్రచారం

కరీంనగర్ 18వ డివిజన్ రేకుర్తిలోని విజయపురి, శాతవాహన కాలనీ, ధర్మపురి కాలనీ, రాజిరెడ్డి కాలనీ, కొత్తవాడ, పాతవాడ, ట్రినిటీ కాలేజ్ ఏరియా, హనుమాన్‌నగర్, జగిత్యాల మెయిన్ రోడ్డులలో శనివారం శక్తి కేంద్రం ఇన్‌చార్జి, బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీలలో ర్యాలీ తీస్తూ ప్రతి ఇంటికి వెళ్తూ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో నరహరి లక్ష్మారెడ్డి, లక్ష్మిరాజన్, పింగిలి ప్రతాపరెడ్డి, టి.విష్ణుప్రసాదరావు, హస్తపురం విక్రమ్, రాజు, వివేక్, సుధాకర్‌రెడ్డి, జాడి ఎల్లయ్య, నాగుల వెంకటేశ్‌గౌడ్, రాములు, చంద్రకాంత్, అస్తపురం శంకరయ్య, అత్తాపురం ఆంజనేయులు, అస్తపురం కొండగట్టు, రాజలింగం, మల్లేశం, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


హౌసింగ్‌బోర్డు కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న బండి సంజయ్ అన్నవదినలు

విద్యాసంస్థల్లో ముందస్తు దీపావళి వేడుకలు


మానేరులో..


దీపావళి వేడుకల్లో పారమిత విద్యార్థులు


బ్లూబెల్స్ స్కూల్‌లో..


సాధన స్కూల్‌లో..

కరీంనగర్‌లోని పలు విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణను మామిడి తోరణాలు, దీపాలతో అలకరించి శ్రీధనలక్ష్మీ దేవి పూజ నిర్వహించారు. పలువురు విద్యార్థులు దేవతామూర్తుల వేషధారణలో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దీపావళి పండుగ ప్రాముఖ్యతను పాటలు, కథల రూపంలో వివరించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. బాణసంచా కాలుస్తు సంబురంగా వేడుకల్లో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆయా విద్యాసంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

\- కరీంనగర్/సప్తగిరికాలనీ/విద్యానగర్/కొత్తపల్లి


భగవతిలో..



జాన్సన్ గ్లోబల్‌లో..



కోరా పాఠశాలలో..


సెయింట్‌జార్జ్ ఇన్నోస్ బ్లాక్‌లో..


స్టార్ కిడ్స్ స్కూల్‌లో..


రేకుర్తి ప్యారడైజ్‌లో..



సెయింట్ పాల్ స్కూల్‌లో..

పండగొస్తే అవస్థలే..!


కరీంనగర్ మార్కెట్ ప్రాంతంలో ట్రాఫిక్ జాం

రద్దీగా మారుతున్న మార్కెట్, టవర్‌సర్కిల్ ప్రాంతాలు

- రోడ్డు మీదనే దీపావళి పండుగ ప్రత్యేక దుకాణాలు
- వాహనాలు కదలలేక ట్రాఫిక్ జాం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

కరీంనగర్‌క్రైం: పండగ వచ్చిందంటే చాలు మార్కెట్‌లోకి వెళ్లాలంటే ప్రజలు జంకుతున్నారు. ధనత్రయోదశి, దీపావళి పండుగ ఉండడంతో రెండు మూడు రోజుల నుంచే మార్కెట్‌ల్లో రద్దీ మొదలైంది. ఏ పండుగలు వచ్చిన పండుగకు సంబంధించిన ప్రత్యేక వ్యాపారులు, రైతులు రోడ్ల మీదనే తాత్కాలిక దుకాణాలు ఏర్పాటు చేస్తుండడంతో నగరంలోని ప్రధాన కూరగాయల మార్కెట్ సమీపంలో రద్దీ ఏర్పడుతోంది. వాహనదారుల వాహనాలు లోపలికి పోలేక బయటికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు.

మార్కెట్లో ట్రాఫిక్‌జాం

దీపావళి సందర్భంగా పండుగకు కావాల్సిన సామగ్రి, దీపాలు, వత్తులు, మామిడాకులు, ఇతర వస్తువులన్నీ కావాలని వేల సంఖ్యలో జనం ప్రధాన కూరగాయాల మార్కెట్, ప్రకాశం గంజ్, టవర్‌సర్కిల్ ప్రాంతానికి వెళ్తుంటారు. దీపావళితో పాటు ప్రతీ పండుగకు ఇక్కడ ప్రత్యేక దుకాణాలు వెలుస్తుండడంతో అందరూ మార్కెట్ ప్రాంతానికి వెళ్తున్నారు. ఒకేరోజు వేల సంఖ్యలో వెళ్తుండడంతో పార్కింగ్‌తో పాటు దుకాణాలు రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సాధారణ రోజుల్లోనే రద్దీగా ఉండే ఈ ప్రాంతం పండుగ వస్తే వాహనాలపై వెళ్లాలంటే జంకుతున్నారు. నడుచుకుంటూ కూడా పోలేని పరిస్థితి ఏర్పడుతుందని నగరవాసులు వాపోతున్నారు. ట్రాఫిక్ పోలీసులు నియంత్రణ చర్యలు చేపట్టినా వాహనదారుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో సరైన ఫలితం ఉండడం లేదు. పండుగ సామగ్రి కొనుగోలు చేసి బయటకు వచ్చి అందరూ హమ్మయ్య బయటకు వచ్చేసామని అనుకుంటున్నారంటే అర్థం చేసుకోవచ్చు ట్రాఫిక్ పరిస్థితి ఎలా ఉందో. పండుగల సందర్భంగా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాతీయ విద్యా దినోత్సవం


అబుల్ కలాం చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు

కొత్తపల్లి: మౌలానా అబుల్ కలాం జయంతి సందర్భంగా రేకుర్తిలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల/కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. అబుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కరీంనగర్ ఆర్ఎల్‌సీ సురేశ్ మాట్లాడుతూ అబుల్ కలాం చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థుల అడ్మిషన్లు పెంచడంతో తల్లిదండ్రులు సహకరించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించి అభినందించారు. ప్రిన్సిపాల్ మోనికా సోని, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో పోరాడుదాం


మాట్లాడుతున్న రత్నం రమేశ్

విద్యానగర్(కరీంనగర్): విద్యార్థి అమరవీరుల ఆశయాల స్ఫూర్తితో పోరాడుదామని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ అన్నారు. పీడీఎస్‌యూ విద్యార్థి అమరవీరుల వర్ధంతి సందర్భంగా శనివారం కరీంనగర్‌లోని సహస్ర జూనియర్ కాలేజీలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి సభలో మాట్లాడారు. ఉస్మానియా యూనివర్సిటీలో పురుడు పోసుకున్న పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం ఎన్నో పోరాటాలు నిర్వహించి విద్యార్థుల పక్షాన నిలబడి ఎందరో వీరులు తమ ప్రాణాలు అర్పించారని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించేందుకు ఉద్యమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నవీన్, సంపత్, కళ్యాణ్, రంజిత్, శ్రావణ్‌లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ఓరియంటేషన్ ప్రోగ్రాం

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంటలోని ఎస్ఆర్ఎం కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సులపై శనివారం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రాముఖ్యత, ఆయా కోర్సుల నియమనిబంధనల గురించి కళాశాల ప్రిన్సిపాల్ సి.వెంకటేశ్వర్‌రావు వివరించారు. ఈ కోర్సులు చదివిన విద్యార్థుల నుంచి పరిశ్రమలు ఆశించే నైపుణ్యాలను ఎంబీఏ ఇన్‌చార్జి ఎండీ ఖ్వాజా మొయినొద్దీన్ తెలియజేశారు. కళాశాల చైర్మన్ ఎం.తిరుపతిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

కరీంనగర్ కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన మైనార్టీ డిక్లరేషన్‌తో ఆ వర్గాల్లో నూతనోత్సాహం వెల్లివిరిస్తోందని డీసీసీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ తాజొద్దిన్, క్రిస్టియన్ మైనార్టీ నాయకుడు ముల్కల ప్రవీణ్‌లు అన్నారు. శనివారం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మైనార్టీల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతుందని అన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం పార్టీలు మైనార్టీల ద్రోహులని విమర్శించారు.

సంజయ్ చేసిన అభివృద్ధిపై చర్చకు సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న గుగ్గిళ్లపు రమేశ్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు బండి సంజయ్ కుమార్ చేసిన సుమారు రూ.8000 కోట్ల అభివృద్ధి పనుల వివరాలను తెలియజేయడానికి సిద్ధంగా ఉన్నామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్లపు రమేశ్ అన్నారు. శనివారం బీజేపీ జిల్లా కార్యాలయంలో కార్పొరేటర్లు బీజేపీ జిల్లా పదాధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. అనవసరంగా ఎంపీపై వ్యాఖ్యలు చేసే బీఆర్ఎస్ నాయకులు, మంత్రి, మేయర్‌లు చర్చకు సిద్ధం కావాలని, తేదీ, సమయం, వేదిక ఖరారు చేస్తే మీడియా సాక్షిగా వివరాలు ఇస్తామని అన్నారు. నిరంతరం ప్రజల్లో ఉండి, ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ, అభివృద్ధి కోసం ఆలోచన చేసే బండి సంజయ్ గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ నాయకులకు, మేయర్ సునీల్‌రావుకు లేదన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజేంద్రప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి బొంతల కల్యాణ్ చంద్ర, మీడియా కన్వీనర్ కటకం లోకేశ్, కార్పొరేటర్లు దుర్శెట్టి అనుప్, రాపర్తి విజయ, కోలగని శ్రీనివాస్, పెద్దపల్లి జితేందర్, కాసర్ల ఆనంద్, బండ రమణారెడ్డి, నాగసముద్రం ప్రవీణ్, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు అవదుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

డీసీసీ ఉపాధ్యక్షుడిగా కల్వాల రాంచందర్



కరీంనగర్‌కార్పొరేషన్: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నగరంలోని కిసాన్‌నగర్‌కు చెందిన కల్వాల రాంచందర్ నియమితులయ్యారు. ఈమేరకు శనివారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ నియామకఉత్తర్వులు జారీ చేశారు. కాగా తన నియామకానికి సహకరించిన మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్న రాజమల్లయ్యకు రాంచందర్ కృతజ్ఞతలు తెలిపారు.